క్లుప్తంగా

బాధ్యతలు స్వీకరణ



బాధ్యతలు చేపడుతున్న కిరణ్‌కుమారి

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ కిరణ్‌కుమారి శనివారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఇన్‌చార్జి మెడికల్ సూపరింటెండెంట్‌గా ఉన్న డాక్టర్ రవికుమార్ మెడికల్ లీవ్ పెట్టడంతో ఆయన స్థానంలో డాక్టర్ కిరణ్‌కుమారికి బాధ్యతలు అప్పగించారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఆమెను ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

మొక్కలు కాపాడాలి



చందారంలో నర్సరీని పరిశీలిస్తున్న డీపీవో

లక్సెట్టిపేట: మండలంలోని చందారం, తిమ్మాపూర్ గ్రామాల్లోని నర్సరీ, డంపింగ్ యార్డులు, శ్మశానవాటికలను శనివారం డీపీవో వెంకటేశ్వర్ రావు సందర్శించారు. వేసవి కాలం సమీపిస్తున్నందునా మొక్కలను ప్రత్యేక శ్రద్ధతో కాపాడాలని సూచించారు. ప్రతీరోజు నీటిని అందించాలన్నారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలన్నారు. రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీనివాస్, కార్యదర్శులు శ్రీలత, దుర్గాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

వీహెచ్‌పీ సమావేశం



మాట్లాడుతున్న గుమ్ముల సత్యం

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో శనివారం విశ్వహిందూ పరిషత్ జిల్లా విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా క్షేత్ర సంఘటన మంత్రి గుమ్ముల సత్యం పాల్గొని మాట్లాడారు. సమాజంలో హిందూ సంఘటన ఆవశ్యకత ఎంతో అవసరమని, హిందువుల జనాభా తగ్గుతుండడం హిందూ సమాజానికి ముప్పు వాటిల్లుతుందని, హిందువు జాగృతం కావాలన్నారు. వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు రేవల్లి రాజలింగు, పరిషత్ జిల్లా కార్యదర్శి వేముల రమేశ్, జిల్లా ఉపాధ్యక్షురాలు కనకతార, నగర కార్యదర్శి కొండపర్తి సంజీవ్, మాతృశక్తి సంయోజక ముత్యం పద్మ పాల్గొన్నారు.

టేలాల తొలగింపు

మందమర్రిరూరల్: మున్సిపాలిటీ పరిధిలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రహరీని ఆనుకొని ఇటీవల అక్రమంగా వేసిన టేలాలను శనివారం మున్సిపల్ టీపీవో తిరుపతమ్మ ఆధ్వర్యంలో మూడు టేలాలను మున్సిపల్ సిబ్బంది తొలగించారు. ఈ సందర్భంగా టీపీవో మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ భూమిలో ఎలాంటి అక్రమ నిర్మాణాలు చేయరాదని, టేలాలు వేయరాదన్నారు. అక్రమంగా వేసినట్లైతే తప్పకుండా తొలగిస్తామని హెచ్చరించారు.

దరఖాస్తుల స్వీకరణ

భీమారం: మండలంలోని భీమారంలో అనర్హులకు రేషన్‌కార్డులు మంజూరు చేశారని ఫిర్యాదులు రావడంతో కలెక్టర్ కుమార్ దీపక్ స్పందించి శనివారం నుంచి గ్రామాల్లో తిరిగి రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరించాలని ఆదేశించారు. ఈ మేరకు రెవెన్యూ, పంచాయ తీ శాఖ అధికారులు గ్రామాల్లో మరోసారి దరఖాస్తులు స్వీకరించడం ప్రారంభించారు.

అటవీశాఖ అధికారుల దాడులు



ఇంట్లో తనిఖీ చేస్తున్న రేంజ్ అధికారి, సిబ్బంది

జన్నారం: స్మగ్లింగ్ నిరోధంలో భాగంగా శనివారం జన్నారం అటవీ డివిజన్ ఇందన్‌పల్లి రేంజ్ పరిధిలో అనుమానిత గ్రామాల్లో అటవీశాఖ రేంజ్ అధికారి కారం శ్రీనివాస్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. కవ్వాల్ అటవీ సెక్షన్‌లోని హాస్టల్‌తాండా, నాయకపు గూడ గ్రామాల్లో ఇంటింటిని తనిఖీ చేశారు. ఈ ప్రాంతం నుంచి కలప తరలించే అవకాశం ఉన్నందునా ముందస్తుగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు రేంజ్ అధికారి శ్రీనివాస్ తెలిపారు. రేంజ్ పరిధిలో స్మగ్లింగ్ పూర్తిగా నిరోధించేందుకు రాత్రి, పగలు పెట్రోలింగ్‌తో పాటుగా దాడులు కూడా నిర్వహిస్తామన్నారు. సెక్షన్ అధికారులు రవి, హన్మంతరావు, బీట్ అధికారులు ముజీబ్‌ఖాన్, రుబీనా, బేస్‌క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

పట్టాల పంపిణీకి ఎస్టేట్ అడ్డంకి..!

- క్వార్టర్ల మధ్య ఇళ్లు ఉన్నాయని వితండవాదం
- ఇప్పటికే ఏడు విడతలుగా పట్టాల పంపిణీ
- ఎస్టేట్ విభాగం అభ్యంతరాలతో మరో 2వేల మందికి నిలిపివేత



అబ్రహంనగర్ కాలనీ..



ప్రభుత్వానికి అప్పగించని శాంతినగర్‌కాలనీ

రామకృష్ణాపూర్: రామకృష్ణాపూర్ పట్టణంలో సింగరేణి పట్టాల పంపిణీకి ఎస్టేట్ విభాగం అడ్డు పడుతోంది. కొర్రీల కారణంగా రెండు వేల మందికి పట్టాల పంపిణీ నిలిచిపోయింది. సింగరేణి కాలరీస్ వ్యాప్తంగా బొగ్గుగని కార్మికులు, కార్మికేతరులు సొంతంగా నిర్మించుకున్న ఇళ్లకు గత ప్రభుత్వం 76జీవో ద్వారా పట్టాలు పంపిణీ చేసింది. ఇప్పటివరకు ఏడు విడతలుగా పట్టాలు పంపిణీ చేశారు. రామకృష్ణాపూర్‌లో 3,359మందికి పట్టాలు అందజేశారు. పట్టణంలోని వివిధ కాలనీల్లో మరో రెండు వేలకు పైగా ఇళ్ల పట్టాలు పంపిణీ చేయాల్సి ఉంది. ఆర్కే–4 గడ్డ, శాంతినగర్, వల్లభాయినగర్, నాగార్జునకాలనీ, ప్రగతికాలనీ, రాజీవ్‌నగర్, ఠాగూర్‌నగర్, రామ్‌నగర్, భగత్‌సింగ్‌నగర్, గంగాకాలనీ, సూపర్‌బజార్ ఏరియా, దుర్గారావుమార్కెట్, గీతామందిర్ ఏరియా తదితర కాలనీల్లో పట్టాల పంపిణీ ప్రక్రియ నిలిచిపోయింది. సింగరేణికి చెందిన ఎస్టేట్ విభాగం అధికారులు అభ్యంతరాలే నిలిపివేతకు కారణంగా తెలుస్తోంది. కంపెనీ క్వార్టర్ల మధ్య ఇళ్లు కట్టుకున్నారని, ఆ ఇళ్లకు పట్టాలు ఎలా ఇస్తామంటూ అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలిసింది. దాదాపు కోల్‌బెల్ట్ వ్యాప్తంగా ఇలాంటి పరిస్థితులే ఉన్నా ఇక్కడ అభ్యంతరం వ్యక్తం చేయడంపై బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ భూమిని సింగరేణి సంస్థ సుదీర్ఘకాలం లీజుకు తీసుకున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే కనిపించిన ఖాళీ స్థలంలో కార్మికులు, కార్మికేతరులు నివాసం ఏర్పర్చుకున్నారు. అలాంటి ఇళ్లకు పట్టాలు ఇవ్వబోమంటే ఎలా అని బాధితులు ఆవేదన చెందుతున్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి అడ్డంకి..?

రామకృష్ణాపూర్ పట్టణ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఎస్టేట్ విభాగం అధికారులు అడ్డుపడుతున్నారని కార్మికవర్గాలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సాక్షాత్తు సంస్థ సీఎండీ చెప్పినా శ్మశానవాటిక, డంపింగ్ యార్డు ఏర్పాటుకు స్థలం కేటాయింపులు ఎలాంటి చొరవ తీసుకోలేదు. కానీ పట్టాల పంపిణీకి మోకాలడ్డడం విచిత్రంగా ఉందని కార్మికులు వాపోతున్నారు. మందమర్రి ఏరియా, కార్పొరేట్ స్థాయి ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని న్యాయం చేయాలని, ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి ప్రత్యేక చొరవ చూపి అర్హులైన వారందరికీ పట్టాలు అందించేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

అందరికీ పట్టాలివ్వాలి



రామకృష్ణాపూర్ పట్టణంలో సింగరేణి స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి పట్టాలివ్వాలి. కంపెనీ క్వార్టర్ల మధ్య ఇళ్లు నిర్మించుకున్నారనే సాకుతో ఏరియా ఎస్టేట్ విభాగం అధికారులు కొన్ని కాలనీలను ప్రభుత్వానికి అప్పగించకపోవటం సరికాదు. అసలు ఈ ఏరియాలో ఎస్టేట్ అధికారులు ఎవరికోసం పనిచేస్తున్నారో అర్థం కావటం లేదు. జనమంతా ఖాళీ అయ్యి ఊరుఊరే బోసిపోతున్న పరిస్థితుల్లో కనీసం పట్టాలు ఇస్తేనైనా ఇక్కడ జనం ఉండే అవకాశం ఉంటుంది. ఇప్పటికైనా సింగరేణి ఉన్నతాధికారులు స్పందించి సింగరేణి స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి పట్టాలు ఇచ్చేలా కంపెనీ స్థలాలను ప్రభుత్వానికి అప్పగించాలి. – అక్బర్‌అలీ, గుర్తింపు సంఘం కేంద్ర కార్యదర్శి

సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

- బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ



సర్వే వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీవో

వేమనపల్లి: ప్రతీ గ్రామంలో ప్రభుత్వ పథకాల సర్వే పకడ్బందీగా నిర్వహించాలని బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ అన్నారు. మండలంలోని కేతనపల్లి, వేమనపల్లి గ్రామాల్లో రైతుభరోసా, రేషన్ కార్డులు, ఆత్మీయ భరోసా పథకాల అమలు తీరు పరిశీలించారు. అనర్హులకు అవకాశం ఉండకూడదని, అర్హత కలిగిన ప్రతీ ఒక్కరిని గుర్తించాలన్నారు. రైతుభరోసా లబ్ధిదారుల ఎంపిక విషయంలో పారదర్శకత లోపించకూడదని సూచించారు. కులగణన సర్వేలో వచ్చిన రేషన్‌కార్డుల అప్లికేషన్లను వెరిఫికేషన్ చేయాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ రమేశ్ తదితరులు ఉన్నారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

శ్రీరాంపూర్: సింగరేణి పరిసర గ్రామాల్లోని నిరుద్యోగులకు వోల్వో డంప్ ట్రక్ ఆపరేటర్‌గా ఉచిత బేసిక్ శిక్షణ అందిస్తున్నట్లు ఏరియా డీజీఎం(పర్సనల్) అరవిందరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాసై ఉండి, హెవీ గూడ్స్ వెహికిల్ డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉన్న యువకులు అర్హులన్నారు. ఈ నెల 20లోగా శ్రీరాంపూర్ వీటీసీలో దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా సూచించారు.

బ్రహ్మ బాబాకు శ్రద్ధాంజలి



నివాళులర్పిస్తున్న జడ్జి, బ్రహ్మకుమారీలు

బెల్లంపల్లి: బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వ విద్యాలయ సంస్థ వ్యవస్థాపకులైన బ్రహ్మ బాబా స్మృతి దినాన్నీ శనివారం బెల్లంపల్లిలో నిర్వహించారు. స్థానిక బ్రహ్మకుమారి ఈశ్వరీయ విద్యాలయం శాఖ కార్యాలయంలో బెల్లంపల్లి జూనియర్ సివిల్ కోర్టు జడ్జి జె.ముకేష్ బ్రహ్మబాబా చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. సంస్థ అందించే రాజ యోగం ద్వారా ఒత్తిడిని జయించి సమస్యలను ప్రశాంతంగా అధిగమించవచ్చన్నా రు. బ్రహ్మకుమారి సంస్థ సమాజానికి అందించిన బ్రహ్మబాబాకు రుణపడి ఉంటామని పేర్కొన్నారు. బెల్లంపల్లి సెంటర్ ఇన్‌చార్జి బీకే పద్మ, కైవల్య, రవి కుమార్, సభ్యులు ఉన్నారు.

నూతన క్యాలెండర్ల ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ కుమార్‌దీపక్

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల కలెక్టర్ కార్యాలయంలో శనివారం పీఆర్‌టీయూ తెలంగాణ 2025నూతన సంవత్సర క్యాలెండర్‌ను కలెక్టర్ కుమార్‌దీపక్ ఆవిష్కరించారు. డీఈవో కార్యాలయ ప్రాంగణంలో యాదయ్య ఆవిష్కరించారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల జిల్లా పంచాయతీ అధికారులు, పంచాయతీ కార్యదర్శుల నూతన సంవత్సర క్యాలెండర్‌ను శనివారం కలెక్టర్ కుమార్‌దీపక్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు, బెల్లంపల్లి ఇన్‌చార్జి డీఎల్‌పీవో సఫ్దర్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

జైపూర్: సింగరేణి గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం క్యాలెండర్‌ను హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో శనివారం గిరిజన ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు భాస్కర్‌రావు, రాష్ట్ర ప్రధానకార్యదర్శి నాగేశ్వర్‌రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ పంతుల ఆధ్వర్యంలో సింగరేణి సీఎండీ బలరాం, డైరెక్టర్లు వెంకటేశ్వర్‌రెడ్డి, సత్యనారాయణ ఆవిష్కరించారు.

శ్రీరాంపూర్: సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను శ్రీరాంపూర్ జీఎం ఎల్వీ సూర్యనారాయణ శనివారం ఆవిష్కరించారు.

సంక్షిప్త వార్తలు

ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి

మందమర్రిరూరల్/బెల్లంపల్లి/పాతమంచిర్యాల: ఉమ్మడి రాష్ట్ర దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు వర్ధంతిని శనివారం బెల్లంపల్లి, మందమర్రి, మంచిర్యాలలో టీటీడీపీ, టీఎస్‌టీయూసీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఎన్టీరామారావు చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

వాటర్ ట్యాంక్ నిర్మాణం ఆపేయాలి

చెన్నూర్: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో తలపెట్టిన వాటర్ ట్యాంక్ నిర్మాణ ప్రతిపాదనలు వెంటనే విరమించుకోవాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు జాడి తిరుపతి అన్నారు. వాటర్ ట్యాంక్ నిర్మాణాన్ని నిలిపివేయాలని కోరుతూ జాతీయ కమిషన్ ఆఫ్ చైల్డ్ ప్రొటెక్షన్ రైట్ ఢిల్లీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

డప్పుల అందజేత

కోటపల్లి: వర్గీకరణే లక్ష్యంగా చెన్నూర్‌లో 21న, ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో జరిగే లక్షడప్పులు.. వేల గొంతుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వర్గీకరణ జేఏసీ కన్వీనర్ మంత్రి రామయ్య శనివారం పిలుపునిచ్చారు. దేవులవాడ, లక్ష్మీపూర్, అర్జునగుట్ట గ్రామాల్లో బీజేపీ జనరల్ సెక్రటరీ దుర్గం అశోక్ అందించిన 100డప్పులను మాదిగ కులస్తులకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు లచ్చన్న, రాజేందర్, రవికుమార్, మధుకర్, సాయికుమార్, పోశం, బానయ్య పాల్గొన్నారు.

సాగు భూముల వివరాల సేకరణ

మందమర్రిరూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతుభరోసా కోసం మండలంలోని సాగులో ఉన్నటువంటి భూముల వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. మండలంలోని అందుగులపేట గ్రామపంచాయతీ కార్యాలయంలో శనివారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తహసీల్దార్ సతీష్‌కుమార్, అగ్రికల్చర్ ఏడీ భానుప్రసాద్, మండల ఏవో కిరణ్మయి వద్ద వివరాలు సేకరించారు. సేకరించిన వివరాలను ఉన్నతాధికారులకు పంపించనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐ గణపతి, కార్యదర్శి వీరేందర్, కాంగ్రెస్ నాయకులు, రైతులు ఉన్నారు.

ఓపెన్ జిమ్ ప్రారంభం

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణంలోని 5వ వార్డులో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం ఆవరణలో రూ.10లక్షల మున్సిపల్ నిధులతో నిర్మించిన ఓపెన్ జిమ్‌ను శనివారం వార్డు కౌన్సిలర్ సుదమల్ల హరికృష్ణ ప్రారంభించారు. సద్వినియోగం చేసుకోవాలన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత నెన్నెల జట్టు

నెన్నెల: మండలంలోని చిత్తాపూర్‌లో యువత ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీ విజేతగా నెన్నెల జట్టు నిలిచింది. పది రోజుల పాటు కొనసాగిన టోర్నమెంట్‌లో 30జట్లు పాల్గొన్నాయి. శనివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో నెన్నెల జట్టు దహెగాం మండలంలోని హత్తిని జట్టును ఓడించి ఛాంపియన్‌షిప్ దక్కించుకుంది. విజేతలకు బెల్లంపల్లిరూరల్ సీఐ అఫ్జలోద్దీన్, నెన్నెల ఎస్సై ప్రసాద్ బహుమతులు ప్రదానం చేశారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

కోటపల్లి: మండలంలోని ఆలుగామలో శనివారం మెగా క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వాహకులు మాజీ సర్పంచ్ సంతోశ్, ఎస్సై రాజేందర్ ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులకు టీషర్టు, స్పోర్ట్స్ కిట్లును అందజేశారు.

నేడు రక్తదాన శిబిరం

చెన్నూర్: చెన్నూర్‌లో ఆదివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు జాడి తిరుపతి, వెంకటనర్సయ్య తెలిపారు. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 18నుంచి 65సంవత్సరాలు ఉండి 45కిలోల బరువు ఉన్న వారు రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు.

నియామకం

కాసిపేట: మండల కేంద్రానికి చెందిన కాసిపేట గనిలో విధులు నిర్వర్తించే బన్న లక్ష్మణ్‌దాస్‌ను శనివారం ఐఎన్‌టీయూసీ కేంద్ర కమిటీ ప్రచార కార్యదర్శిగా నియమించారు. తెలంగాణ కనీస వేతన సలహా మండలి చైర్మన్ జనక్‌ప్రసాద్ నియమించినట్లుగా ఆయన ప్రకటించారు.

సన్మానం

మంచిర్యాలటౌన్: తెలంగాణ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహ నిర్మాణ సంఘం లిమిటెడ్ జిల్లా కమిటీ సభ్యులను శనివారం స్థానిక టీఎన్జీవోస్ భవన్‌లో సభ్యులు ఘనంగా సన్మానించారు.

రేపు గ్రామసభలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల పంపిణీకి సంబంధించిన లబ్ధిదారుల ఎంపిక గ్రామసభలు 20వ తేదీ సోమవారం ఆయా గ్రామాల పంచాయతీల ఆవరణలో నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసరావుదేశ్‌పాండే, ఎంపీడీవో ప్రసాద్, ఏవో కృష్ణ శనివారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు.

పరీక్ష సామగ్రి అందజేత

చెన్నూర్‌రూరల్: మండలంలోని పొక్కూరు జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో ఉపాధ్యాయుడు డి.రమేష్ తన సొంత ఖర్చులతో శనివారం పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం దత్తకుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సర్వే పరిశీలన

కాసిపేట: ప్రభుత్వ పథకాలకు అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు గ్రామాల్లో చేపట్టిన సర్వే పకడ్బందీగా నిర్వహించాలని మండల ప్రత్యేకాధికారి సాంబశివరావు తెలిపారు. మండలంలోని కొండాపూర్ గ్రామపంచాయతీలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు, రైతు భరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలకు లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు చేపట్టిన సర్వేను శనివారం ఆయన పరిశీలించారు.

కంకాలమ్మ జాతరకు ఏర్పాట్లు పూర్తి

- నేటి నుంచి ప్రారంభం
- స్వయంభూగా వెలసిన కేతేశ్వరస్వామి, కంకాలమ్మ



లింగాకారంలో కొలువుదీరిన కేతేశ్వర స్వామి

జన్నారం: గుట్టపైన బండరాయిల మధ్య కొలువుదీరిన కంకాలమ్మ, కేతేశ్వర శివాలయ జాతరకు ఆలయం ముస్తాబైంది. మేదరి కులస్తుల ఆరాధ్య దైవం కేతేశ్వరస్వామి కంకాలమ్మ దేవతలకు ప్రతీ సంవత్సరం ప్రత్యేక పుజలు చేయడం కోసం ఏటా జాతర నిర్వహిస్తారు. ఈ నెల 19న మహేంద్ర సంఘం ఆధ్వర్యంలో జాతర నిర్వహించనున్నట్లు, ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

స్వయంభూగా వెలసిన దైవం..

దశబ్దాల క్రితం జన్నారం మండలం పొనకల్ పరిసర ప్రాంతంలో అటవీ సమీపంలో వీర్లగుట్టపైన బండరాళ్ల మధ్యన శ్రీ కేతేశ్వర స్వామి కంకాలమ్మ సహితంగా వెలిసినట్లు మహేంద్ర సంఘం పెద్దలు చెబుతున్నారు. 11సంవత్సరాల క్రితం ఆలయం నిర్మించి, సౌకర్యాలు చేకూర్చారు. 10సంవత్సరాలుగా ఆలయాన్ని మహేంద్ర సంఘం ఆధ్వర్యంలో అభివృద్ధిలోకి తెచ్చారు. ఆలయ సమీపంలో ఆంజనేయస్వామి, గణపతి, సరస్వతి, నల్లపోచమ్మ, నాగదేవతలు కొలువుదీరారు.

కోరిన కోర్కెలు నెరవేరుతాయి..

దశాబ్దాల కాలం క్రితం స్వయంభువుగా వెలసిన లింగాకారుడు, శ్రీ కేతేశ్వర స్వామి కంకాలమ్మ సమేతంగా భక్తులకు దర్శనమిస్తున్నారు. మహిమాన్వితుడుగా కోరిన భక్తుల కోరికలను నెరవేరుస్తున్నారు. నిత్యం పూజలందుకుంటున్న స్వామికి ప్రతీ సంవత్సరం జాతర జరుపుతున్నారు. పూజా సమయంలో నాగుపాము స్వామివారిని దర్శించుకోవడం పలుమార్లు గమనించాను. – భూమయ్య స్వామి, ఆలయ పూజారి

13ఎకరాల ప్రభుత్వ భూమి స్వాధీనం



స్వాధీనం చేసుకుంటున్న రెవెన్యూ అధికారులు

తాండూర్: ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు తిరిగి స్వాధీనం చేసుకున్న ఘటన తాండూర్ మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. తాండూర్ మండలం అచ్చులాపూర్ గ్రామ శివారు సర్వే నంబర్ 972లో ఉన్న 13ఎకరాల ప్రభుత్వ భూమిని 2021ఫిబ్రవరి 21న అటవీశాఖకు అప్పటి జిల్లా కలెక్టర్ కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ భూమిని కొంతమంది ఆక్రమించి మామిడి తోట పెంచారు. ప్రభుత్వ భూమి దురాక్రమణకు గురైనట్లు గ్రహించిన ప్రస్తుత కలెక్టర్ తిరిగి స్వాధీనం చేసుకోవడానికి రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు శనివారం తాండూర్ నాయబ్ తహసీల్దార్ ప్రసాద్ ఆధ్వర్యంలో ఆర్‌అండ్‌బీ, అటవీ శాఖ అధికారులతో కలిసి పోలీసు బందోబస్తుతో కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆ భూమి వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎస్సై కిరణ్‌కుమార్, గిర్దావరు ఎజాజుద్దీన్, ఆర్‌అండ్‌బీ శాఖ ఏఈ, అటవీ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సింగరేణి భూములు కాపాడాలి

- జీఎం(ఎస్టేట్స్) రాధాకృష్ణ



అధికారులతో మాట్లాడుతున్న రాధాకృష్ణ

శ్రీరాంపూర్: సింగరేణి భూములను అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని సింగరేణి కార్పొరేట్ జీఎం(ఎస్టేట్స్) ఎన్. రాధాకృష్ణ తెలిపారు. సీసీ సీలోని సింగరేణి గెస్ట్‌హౌస్‌లో శనివారం శ్రీరాంపూర్ జీఎం ఎల్వీ సూర్యనారాయణతో కలిసి ఎ స్టేట్స్ డిపార్టుమెంట్‌లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కంపెనీ పరిధిలోని అటవీ భూ ములు, రెవెన్యూ భూముల అంశాలపై చర్చించా రు. బెల్లంపల్లి, మందమర్రి, శ్రీరాంపూర్ డివిజన్‌లో కంపెనీ భూముల వివరాలు, వాటి స్థితిగతులను ఏరియా అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఏరియా ఎస్టేట్స్ అధికారి వరలక్ష్మి, అడిషనల్ మేనేజర్ మహేశ్, కార్పొరేట్ అడిషనల్ మేనేజర్ సురేష్, ఎస్టేట్స్ అధికారి శ్రీనివాస్, మందమర్రి ఏరియా ఎస్టేట్స్ అధికారి స్వప్న, బెల్లంపల్లి ఏరియా ఎస్టేట్ అధికారి మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీ వెంకటేశ్వర హోమ్ వరల్డ్ ప్రారంభం



ప్రారంభిస్తున్న డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మార్కెట్ రోడ్డులోని అర్చన టెక్స్ చౌరస్తాలో లక్ష్మీ వెంకటేశ్వర హో మ్ వరల్డ్‌ను మంచిర్యాల డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ శ నివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గృహానికి సంబంధించి అ న్ని రకాల వస్తువులు ఒకే చోట లభించడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో డీసీపీ భాస్కర్, మంచిర్యాల మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్య, గుండా సుధాకర్, ముఖేష్ గౌడ్, విలేజ్ కామెడి నిర్వహకురాలు గంగవ్వ, నిర్వహకులు ఆర్ఎస్ సదానందం, అంజిమామ, లక్ష్మీ గణపతి జ్యువెల్లరి యాజమాన్యం, సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపాలిటీ ఎన్నికల కోసం కృషి



మాట్లాడుతున్న జేఏసీ కన్వీనర్ శ్రీనివాస్

మందమర్రిరూరల్: మందమర్రి మున్సిపాలిటీలో 30సంవత్సరాలుగా ఎన్నికలు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, ఎన్నికల నిర్వహణ కోసం ఏర్పడిన జేఏసీ ఆధ్వర్యంలో కృషి చేస్తామని పొలిటికల్ జేఏసీ కన్వీనర్ అందుగుల శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల జేఏసీ నాయకులతో కలిసి మాట్లాడారు. ఎన్నికల నిర్వహణ కోసం కేంద్రంలో సంబంధిత మంత్రులను కలిసి సమస్యను విన్నవిస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యేపై కూడా ఒత్తిడి తీసుకురావాలని కోరారు. ప్రజలు సహకరించాలన్నారు. సమావేశంలో జేఏసీ కోకన్వీనర్లు, నాయకులు మేడిపెల్లి సంపత్, బండారి సూరిబాబు, అబ్బాస్, తిరుపతిరెడ్డి, సదానందం, రాజేంద్రప్రసాద్, కనుకయ్య, నర్సింగ్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

బడి బయటి పిల్లల సర్వే

కాసిపేట/చెన్నూర్‌రూరల్: మండలంలోని ధర్మరావుపేట స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో శనివారం సీఆర్‌పీ తిరుపతి ఆధ్వర్యంలో నాయకపుగూడెం, వరిపేట, బుగ్గగూడ, హబిటేషన్‌లలో బడిబయట పిల్లల సర్వే నిర్వహించారు. 15నుంచి 19సంవత్సరాల మధ్య వయసులో ఒక్కరిని గుర్తించినట్లు తెలిపారు. 6 నుంచి 14 సంవత్సరాలు, 15 నుంచి 19 సంవత్సరాల విభాగాల్లో సర్వే చేపట్టినట్లు తెలిపారు. బడిఈడు పిల్లలు బడిబయట ఉన్నట్లైతే సమాచారం ఇవ్వాలన్నారు. ఆపరేషన్ స్మైల్ బృందం ఆధ్వర్యంలో చైల్డ్ వెల్ఫేర్ వారి సహకారంతో చెన్నూర్ మండలంలోని కత్తెరసాలలో బడి మానేసిన నలుగురు విద్యార్థులను శనివారం చెన్నూర్‌లోని జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో చేర్పించారు.

స్ట్రీట్ లైట్లు ప్రారంభం

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణంలోని 9వ వార్డు పాతమంచిర్యాలలో రూ.5లక్షలతో ఏర్పాటు చేసిన స్ట్రీట్ లైట్లను మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య శనివారం ప్రారంభించారు. స్థానిక కౌన్సిలర్ బొలిశెట్టి సునిత చొరవతో వీధి దీపాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మంచిర్యాల :
9010299065, 9951602823
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
తిరుపతి, ACO - 7997958206
మంచిర్యాల : సల్మాన్‌ఖాన్ - 7995855506
బెల్లంపల్లి : సంపత్ - 7036227114
చెన్నూర్ : సంపత్‌కుమార్ - 9949708989
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899